# సుందర జీవితం

"శ్రుతి, స్మృతి, పురాణేతిహాసాలను సాగరాన్ని మథించి సారరూపమయిన అమృతంగా అధ్యాత్మరామాయణాన్ని వ్యాసభగవానులవారు..." అని రామమూర్తిగారు వేణుగోపాలస్వామి ఆలయంలో తమ గంభీరోపన్యాసం ఆరంభించారు. శ్రద్ధగా విందామని కూర్చున్న ప్రకాశానికి అంతలో ఏదో జ్ఞాపకంవచ్చి లేచిపోయి ఇంత జనంమధ్య కూర్చుని, ఉపన్యాసం మొదలెడ్తూండగానే వెళ్ళిపోవటం మంచిది కాదనిపించింది. అందులోనూ ఆ రోజున ఆంజనేయస్వామివారు మహేంద్రగిరిమీదనుంచి ఎగిరి లంకా ప్రవేశ ప్రస్తావంచేస్తారు. ఆ ఘట్టం రామమూర్తిగారు చెప్తూండగానే వినాలన్నారు- అతనితో కొందరు. అంతవరకూ ఎలా నడిచినా ఆ ఘట్టంలో మాత్రం ఆయన ఆంజనేయుడిలా కనిపిస్తాడని అంతక్రితం రెండుమూడుసార్లు విన్నవారు అనుకోగా ప్రకాశం విన్నాడు. అందుచేత ఏమయినాసరే కదలకూడదనుకున్నాడు. అందులోనూ కిష్కింధాకాండ ఆ సన్నివేశంతో ఆఖరై సుందరకాండ ప్రారంభమవుతుంది. అదేదో గమ్మత్తుగా 'దశాచ్ఛిద్రంలో శనియోగించినట్లు' కిష్కింధాకాండ అంతంనుంచే రామాయణగాథ సుఖాంతమవుతుందనే విశ్వాసం కలుగుతుంది. జీవిత రామాయణంలోకూడా పూర్తిగా నిరాశపడి 'శాపుల్ తప్పెను' అనే స్థితికి జారాకనే సుందరకాండ ప్రారంభిస్తుందని ప్రకాశం నమ్మకం. అలానే కూర్చున్నాడు.

* * * *

ఉదయ సంధ్యాకాంతులు హేమంత తుషారంలో చిక్కుపడి పోయాయి. విషాదతమో వృతమయిన తన భార్య వదనంలోని దివ్య ప్రసన్నతలా కనిపించింది ఉదయ శోభ ప్రకాశానికి.

కిటికీ ఎదురుగా పడక మంచంమీద కూర్చుని గోడకి నడుంచేర్చి శూన్యాన్ని చూస్తున్నాడు. కిటికీకి తన దృష్టికి మధ్యగా ఉయ్యాలలో రెండేళ్ళ 'బాబి' చిరునవ్వుతో నిద్రపోతున్నాడు. ప్రత్యక్షంగా కొంత దూరంలో వంటింటి గుమ్మందగ్గర కుంపటి అంటించి కాఫీకి నీళ్లుపడేసి విసరుతోంది సుబ్బులు. ఒక్కసారి ఆమెవైపు తేరిపార చూడాడు ప్రకాశం. ఆమె తన పనిలో తాను నిమగ్నురాలయి ఉంది.

ఇదివరలో ఆమె విసురుతూంటే ఆ చేతులు బంగారపు గాజుల తళతళలతో గలగలలాడేవి. ఇప్పుడా చేతుల రబ్బరుగాజులు నీరసించిన ఆమె శరీరంలా వెలవెల బోతున్నవి. ఆమె వంచిన తలపైకెత్తి విసనకర్ర క్రిందపడేసి కళ్లు ఒత్తుకుంది పైటచెంగుతో. ఇదివరలో మనిషి కొద్ది కదిలితే చంద్రహారాలతో శంఖాలతావళం చిక్కులు పడేది. మంగళ సూత్రాల తాడుతో పెనవేసుకుని జడలా అయేవి. ఇప్పుడా మెడలో చిక్కు చిక్కుమంటూ ఒక్క మంగళ సూత్రం, దానినీడలా నల్లపూసలదేరు...ఒకటేమిటి ఆమె కాపురానికొచ్చేనాటికి ఏడువారాల

ఉషశ్రీ

నగలతో మహారాణి వచ్చినట్లుగా అనిపించింది. వచ్చిన మూడు, నాలుగేళ్ల వరకూ ప్రకాశం రాజులాగ సుబ్బులు రాణిలా బ్రతికారు. అంతలో వచ్చింది. మహాప్రమాదం... ఆ ఏడాదే ప్రకాశం తండ్రి పోయాడు. ఆయన పోయేవరకూ ఆ సంసారం దివ్యంగా సాగిపోయింది. ముగ్గురు కూతుళ్ళకూ దమ్మిడీ కట్నం ఇవ్వకుండా, ఆత్రేయ, శాస్త్రియాదికాలు మాని పెళ్ళిళ్ళుచేసి, ఆ అయిదు రోజులూ జరిగిన భోజన భాజనాదికాల కోసం సుమారు పాతిక, ముప్పైయొకరాలమెట్ట క్రయంచేసిన దాన పురుషు డాయన. అంతగా గాకపోయినా ఆయన కొడుకు అనిపించుకున్నాడీయన. ఆస్తులమ్ముకుని అప్పాలు వండుకు తినటం, ఇళ్ళమ్ముకుని ఇడ్డెన్లు తినటం ప్రకాశం జ్ఞానం వచ్చిన దగ్గరనుంచీ ఎరిగిన విషయం. ప్రకాశానికి మైనారిటీ వెడుతుండగానే మిగిలిన ఆ ఒక్క ఇల్లు అమ్మకానికి రిజిస్ట్రారు ఆఫీసుకు వెళ్ళినప్పుడాయనడిగాడు—'ఏమయ్యా, ఈ యిల్లు మీ నాన్నగారు అమ్మటం నీ కిష్టమేనా?' అని.

'ఆయన మానాన్నగారు, అంతే' అని సంతకంచేసేశాడు. ఇది చూసినవాళ్ళంతా తెల్లబోయారు.

ఆ రకంగా ఆ స్థితి అయిపోయినా తండ్రి పోయాంలో కొన్నయిల్లు, ఆయన ఉండగా సాగినభోగం - ఎలా జరిగిందని ఒక్కనాడూ ఆలోచించలేదు ప్రకాశం. ఆయన పోయిన మూడో నెలలో ఇల్లుజప్తుకొచ్చింది. ఏమిటని అడిగాడు. 'నాన్నగారు చేసిన అప్పు' అన్నాడో పెద్దమనిషి.

'అంతేనా! దానికి వేలం ఎందుకూ? ఎవరికి తణఖా ఉందో వారు వచ్చి ఇల్లుస్వాధీనంచేసుకోండి' అని సాయంత్రానికి ఖాళీ చేసి యిచ్చేశాడు. గ్రామంలోని శాస్త్రులు చాలా ప్రలోభాలు కనపరిచారు తణఖాపత్రంమీద నీ సంతకం లేదనీ, అదనీ, ఇదనీ...వినలేదు ప్రకాశం. నాన్నగారు చేశారంటే ఎవరికోసం చేశారు. నాకోసం. అందుచేత ఆయన ఆత్మ క్షోభించటం నా కిష్టంలేదు. అంతే! ఆ మరునాడే ఊరు వదిలేశాడు. అక్కణ్నుంచి ఆరంభమైంది నాటకంలో కని.

శ్రీధర వెంకయ్యగారుకూడా చెప్పారు, అప్పుయిది శౌర్యఖండ యోగజాతకం కాదనీ, ఉత్తరఖండం బ్రహ్మాండంగా వెలుగుతుందనీనూ. వేళాకోళంగా వదిలేశాడు దాన్ని. పైగా ఇరవై అయిదోయేడు ప్రారంభిస్తుండగా ఉన్నకొంప వదులుకోవటం యోగమా? బి. ఏ. డిగ్రీ చేతిలో ఉండీ ఉద్యోగం లేకపోవటం యోగమా?




విజయవాడ స్టాకిస్టులు:
ఎస్కో కార్పొరేషన్ మెయిన్ బజారు.
విజయనగరం స్టాకిస్టులు:
మెసర్సు: మహమ్మద్ యాసిన్ బ్రదర్సు
జనరల్ మర్చంట్సు.

# ★ సుందర జీవితం ★

నమ్మలేదు నవ్వి ఊరుకున్నాడు. తనజాతకంలో ఉన్న మహారాజయోగమో, విపరీత రాజయోగమో అది ఒకటేకట: అనుకూలవతి అయిన అర్ధాంగి దొరకటం. ఆనందాన్నీ ఆపదల్నీ ఒకే స్మితశ్రీతో ఆహ్వానించగలిగిన కళత్రం దొరకటం కంటె మహారాజయోగం లేదన్నాడు, ప్రకాశం తన జ్యోతిశ్శాస్త్రంలో.

యథాశక్తిగా ఉద్యోగంకోసం ప్రయత్నించాడు - కాదు - చేశాడుకూడా. మరి స్వేచ్ఛాజీవితానికి అలవాటుపడ్డ ప్రాణి తలవంచలేక చేరిన ఉద్యోగాన్ని వదిలేశాడు. అయితే కళత్రంతోపాటు మిత్రక్షేత్రం కూడా బావున్నట్టుంది కొంతలో కొంత మెరుగ్గా కొన్నాళ్లు నడిచింది. కాని ఎన్నాళ్ళని నడుస్తుంది—నడవకనే భార్య అలంకారాలన్నీ బజారుకెక్కాయి.

'కడుపునిండా తిండివుంటే కైసేతలు కాని, అది లేనప్పుడు ఈ అలంకారాలు శరీరానికి బరువే' అని వొలిచి అతని చేతుల్లో పోసింది.

ఒకటి రెండుసార్లు సుబ్బుల్ని వాళ్ళమ్మ అడిగింది, 'మెడ యింత బోసిగా ఉందేమే' అని

'ఓ గొలుసు చిక్కుపడి తెగిపోతే అతకటానికి పంపించానని..... ప్రక్క వీధివారి పద్మావతిని పెళ్ళిచూపుల కలంకరిస్తూ తీసుకెళ్ళారనీ' సర్దిచెప్పేసింది. సుబ్బులు అలా చెప్తూంటే ప్రక్కగదిలో ఉండి వింటూన్న ప్రకాశానికి విచిత్రమయిన నవ్వు వచ్చేది పెదవులమీదికి. ఆ నవ్వు వెనకనే హృదయములో ఒక గులాబీముల్లు కసుక్కున గ్రుచ్చుకొనేది.

జీవితచరిత్రను నెమరు వేసుకుంటూన్న ప్రకాశంముఖంమీద ఏదో తళుక్కున మెరిసి, కన్నులు జిగేల్ మనిపించింది. తూర్పుసముద్రం ప్రసవించిన రక్తపుగుడ్డు సూర్యుడు తూర్పుకొండమీదికి ఆడుకోనేందుకు యెక్కాడు. ఆ బాలుడి అరుణకాంతులు కిటికీలోంచి దూసుకు వచ్చి ఉయ్యాలలో నిద్రపోయే 'బాబి'గాడి పెదవుల్ని ముద్దుపెట్టుకుని, వాడి మొలమీది మామిడిపిందెల మొలత్రాడు మీద పడి ప్రకాశం ముఖంలోకి నవ్వుతూ చూశాయి ఒక్కసారిగా కన్నులు మూసి రెండు కన్నీటిచుక్కలు రాల్చాడు.

ఆరోజు సాయంకాలంలోగా అద్దె చెల్లించకపోతే ఇల్లు ఖాళీచెయ్యమని హుకుం చేసి వెళ్ళారు యజమాని. ఔను! ఒకనెల ఊరుకుంటారు, రెండునెల లూరుకుంటారు గాని మరింక ఊరుకోగలరా, ఎంత ఇనపపెట్టెలు కలవారయినా? పైగా సుఖంగా ఉందామని కట్టుకున్న డాబాలు ప్రకాశం లాంటివారికోసం వదిలేసి, పక్క దొడ్లలో తాటాకుగుడిసెలు వేసుకుజీవించే ధనవంతులు సకాలంలో అద్దెడబ్బులు రాకపోతే... వారు తమవంటివారికోసం ఎంత త్యాగం చేస్తున్నారు? అని నవ్వుకున్నాడు.

సరిగ్గా అదేరోజు సాయంత్రానికి తన రెండోబావమరది పెళ్ళాంపిల్లలతో దత్తత తల్లి తద్దినం పెట్టుకునేందుకు వస్తున్నానని టెలిగ్రాం యిచ్చాడు. నీరుతిరిగిన ప్రకాశం కన్నులు పొడారిపోయాయి. ఈ ఆలోచనలో ప్రక్క నిలబడి కాఫీ అందిచ్చే భార్య వైపు చూడలేదు. అతనిదృష్టి బాబిగాడి మొలమీద జిలుగుకాంతులీనుతున్న మామిడి పిందెలలో ఇరుక్కుపోయింది. ప్రక్కవాటాలోంచి రేడియోలో లతామంగేష్కర్ ఆలాపనాలహరి ఆకస్మికంగా అతని చెవుల్లో పడింది. ఆ సమయంలో అతనికి ఆ అమృతలహరిని ఆస్వాదించాలనే కుతూహలానికి బదులు ఒక చిరునవ్వుమాత్రమే ముఖంమీద నాట్యంచేసింది ఆ సావకాశంలో!

"ఏం...ఊహాలోవున్న కథలో అమ్మాయెవరేనా పెళ్ళిబాధ తప్పించటానికి లేచిపోతోందా ఏమిటి?" అంటూ కప్పు చేతికందిచ్చింది, సుబ్బులు.

"లక్ష్మీ...కథలో అమ్మాయి కాదు... జీవితంలోని అబ్బాయే శ్రీమతినీ ... చిరంజీవినీ విడిచి.. " అని ఇంకా చెప్పబోతుండగానే, సుబ్బులు ముక్కుమీదకు తర్జనీ నడిపించి: "తప్పు...తప్పు.. అలా విడిచి వెళ్ళిన బుద్ధుడు స్థాపించినమతం ఈ దేశానికే పనికిరాకుండాపోయింది! అని నవ్వింది

"నవ్వుకాదు!...ఇదిగో మీతమ్ముడు దత్తత తల్లి తద్దినం పెట్టుకొనేందుకు వస్తున్నానని టెలిగ్రాంఇచ్చాడు. సరే యింటిఅద్దె '

అని నీరసంగా దృష్టి ఉయ్యాలవైపు మరలించి కాఫీ త్రాగ సాగాడు.

సుబ్బులక్ష్మి కన్నుల్లో తిరిగిన నీరు భర్తకు కనిపించటం ఇష్టంలేక వెనుతిరిగి వంటింట్లోకి నడిచింది.

ఔను! బాబిగాడికి వాళ్ళ తాతయ్య పుట్టినరోజు కానుకగా పంపారు పంపినాయన ఆగలేక ఆ రోజు మధ్యాహ్నానికే వచ్చి మనవడి మొలకు తగిలించి, ఒళ్ళో కూర్చోబెట్టుకుని, ఇంటికొచ్చిన వారందరితోనూ...

'చూశారా! అసలు పనివాడితనమే పోయింది. పోయిందంటే పోదు మరీ. నకిలీసరుకులమీదికి మన బుద్ధి పోతూంటే...అయినా అసలు ఏ వస్తువు ఎక్కడుంటే శోభిస్తుందో అది అక్కడే ఉండాలి. ఈ మామిడి పిందెల మొలత్రాడు వీడి మొలను ఎంతగా శోభిస్తున్నదో చూడండి. అసలు ఈ రకమయిన పిందెలు తయారు చేయటంలో మా ఊరు సాంబమూర్తి ఉన్నాడే-అతనొక్కడే సమర్థుడు. ఇప్పటికతనికి ఎనభైనిండినా సులోచనాలు లేకుండా ఈ శిల్పం ఎలా నడిపించాడో చూడండి ' అని మురిసిపోయాడు.

ఈ ఊహతో ప్రకాశం మనస్సు మలమలలాడింది.

కానీ......

కాఫీ పూర్తిచేసి కప్పు కింద ఉంచాడు.

ఇంతసేపేడ్చి, ముఖం తుడుచుకుని దగ్గరగా వచ్చి నిలబడింది.

'పాపం! మీ నాన్నకేం తెలుసునే—యాభై యకరాల ఆస్తికీ, రెండంతస్తుల మేడకూ దత్తుడయిన తన కొడుకు దత్తత తల్లి తద్దినానికి మన యింటికి వచ్చేటప్పటికి అందుకోసం ఈ మామిడి పిందెల మొలత్రాడు...'

అని ఒకే ఒక్కసారి ఆమె కన్నుల్లోకి చూసి తలవాల్చేశాడు.

సుబ్బులు గంభీరమౌనంతో అడుగులు కదలించి ఉయ్యాల సమీపించింది నిశ్చింతగా నిద్రపోతూన్న 'బాబి' చెయ్యి మొలత్రాడుమీద పడింది.

సుబ్బులు కన్నీటిచుక్కలు 'బాబి' మీద పడి ఉలిక్కిపడ్డాడు. నెమ్మదిగా వాడి చెయ్యి తప్పించి, మొలబోసిచేసింది.

సుబ్బులు చేతులోంచి అందుకుంటూన్న మామిడిపిందెల మొలత్రాడుమీద ఇద్దరి కన్నీటి చుక్కలూ ఒకేసారి పడ్డాయి.

అదే రోజు సాయంత్రం టపాలో కాలేజీలో ఉద్యోగం వచ్చినట్టు ఉత్తరం అందుకున్నాడు ప్రకాశం. ★


**1956-57లో నీభవిష్యత్తు**



ఒక కార్డులో ఒక పువ్వు పేరు, మీ పేరు, అడ్రసు వ్రాసి పంపండి. మేము 1-4-0లకు వి.పి.గా రాబోయే 12 మాసములకు మీ ఫలితాలు, వ్యాపార లాభనష్టాలు, ఉద్యోగ వివరాలు, మార్పులు, సంతాన వివరాలు సుఖజీవనము, దేహారోగ్యము వగైరాలున్నూ, నలకటలకు తగిన ప్రతిచర్యలున్నూ తెలుపుతాము.

ఉత్తరాలు ఇంగ్లీషులో వ్రాయాలి.

Mahalaxmi Jyotish Ashram,
Post Box 1355 (A P.M)Delhi-6.